## క్లుప్తంగా

### ఘనంగా హరిద్ర శృంగార్చన

**పిట్టలవానిపాలెం:** చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం వివాహంకాని మగ పిల్లలకు శీఘ్రముగా వివాహం జరిగేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు.

### బీమా నగదు అందజేత

**కొల్లూరు:** ప్రమాదంలో మరణించిన కిష్కింద పాలెంలోని గుంటూరు వెంకటేశ్వరరావు ఖననం ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం రూ.10వేలు మంజూరు చేసింది. వాటిని సర్పంచి గుంటూరు నీలాంబరం మృతుడి భార్య స్వర్ణకుమారికి శుక్రవారం అందించారు. ఎంపీటీసీ సభ్యుడు పొలిమట్ల ఆనంద్‌కిశోర్ ఉన్నారు.

### 28న కొల్లూరు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

**కొల్లూరు :** ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు కొల్లూరు బీఆర్కే శాస్త్రి ఐటీఐ కళాశాలలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ గుమ్మడి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునిక రైల్వే పరికరాలు, వందే భారత్ రైళ్ల తయారీ సంస్థ మేధా సర్వో డ్రైవ్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆ సంస్థ ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐలో ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ కోర్సులలో 2018 అనంతరం ఉత్తీర్ణులైన యువత జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు. సోమవారం ఉదయం 9 నుంచి ప్రారంభమవనున్న జాబ్ మేళాకు అర్హతలున్న అభ్యర్థులు ఏ ప్రాంతానికి చెందిన వారైనా.. హాజరు కావొచ్చని వెల్లడించారు. బయోడేటా, 10వ తరగతి, ఐటీఐ మార్క్స్ లిస్టు, ఎస్‌టీసీ నకళ్లతో పాటు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్ తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాలకు 92985 02350 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

### మురుకొండపాడులో వైద్యశిబిరం పరిశీలన



**బాపట్ల:** మురుకొండపాడు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ బృందం శుక్రవారం పరిశీలించింది. పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మార్కెట్‌యార్డు కమిటీ మాజీ అధ్యక్షుడు గవిని కృష్ణమూర్తి గ్రామంలో పర్యటించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల ఏరియా వైద్యులు, వెదుళ్ళపల్లి వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించినట్లు కోకి రాఘవరెడ్డి తెలిపారు. వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలను డాక్టరు వైష్ణవి కృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జోగి రాజా, డాక్టరు రాజేష్, కటికల యెహోషువా, సర్పంచ్ అనిల్‌కుమార్, చేగుడి విల్సన్ తదితరులు ఉన్నారు.

### గుర్రపు డెక్క, తూటికాడతో నీటి పారుదలకు ఆటంకం



**తెనాలి టౌన్:** రూరల్ మండలంలోని గుడివాడ, కోపల్లె, అంగలకుదురు గ్రామాల మీదుగా వెళ్లే జీఆర్‌బీసీ మురుగు కాల్వలో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపుడెక్క ఆకుల్ని వెంటనే తొలగించి రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి అధికారుల్ని కోరారు. సకాలంలో తూటికాడ, గుర్రపు డెక్క ఆకులు తొలగించకపోవడం వల్ల మురుగునీరు పారుదల కావడం లేదని చెప్పారు. సమస్యల్ని డ్రైనేజీ డీఈఈ ఎం.అనిల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన వెంట రైతులు సురేష్, అశోక్, మోహనరావు ఉన్నారు.

### పత్రాలు లేకుండా ట్రాక్టర్లు నడిపితే చర్యలు

**తెనాలి రూరల్:** సరైన పత్రాలు, అనుమతులు లేకుండా ట్రాక్టర్లను నడిపితే చర్యలు తీసుకుంటామని తెనాలి ప్రాంతీయ రవాణాధికారి కె. ప్రసాద్ తెలిపారు. తెనాలితో పాటు చేబ్రోలు మండలం వడ్లమూడి వద్ద శుక్రవారం ట్రాక్టర్ల తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు, లైసెన్సులు లేని ట్రాక్టర్లను గుర్తించి అపరాధ రుసుం విధించారు. ట్రాక్టర్లతో పాటు ట్రెయిలర్లకూ అన్ని అనుమతులు ఉండాలని చెప్పారు. లైసెన్సు లేకుండా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలోని మోటారు వాహనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంవీఐ టి. రాఘవరావు, ఏఎంవీఐ ఎస్.బి. మధుసూదనరావు ఉన్నారు.

# వరలక్ష్మి, ధనలక్ష్మి.. నమోస్తుతే

**రేపల్లె:** పవిత్ర శ్రావణ మాసం రెండవ శుక్రవారం పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని గ్రామదేవత బూరుగులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు నంది వెలుగు భాను సుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సుప్రభాత సేవ, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో కనుల పండువగా అభిషేక మహోత్సం జరిపించారు. అమ్మవారికి రజత వస్త్రాలంకరణ చేశారు. 108 బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. పేటేరులో మహాలక్ష్మి గుండెపాటెమ్మ అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉప్పూడి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఓల్డ్ టౌన్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు లలిత సహస్రనామం, కనకధారా స్తోత్రాలను పఠించారు. ఆయా ఆలయాల కమిటీల సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

**వైభవంగా వరలక్ష్మి వ్రతం పూజలు**

**చందోలు(పిట్టలవానిపాలెం):** చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో శ్రావణ మాసం శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాలక్ష్మి అభయప్రదాయినిగా అలంకరించి, పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఈఓ నరసింహమూర్తి, సిబ్బంది పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు.

**శ్రావణమాస ప్రత్యేక అలంకరణలు..**

**బాపట్ల:** శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవత పోలేరమ్మతల్లికి ప్రత్యేక అలంకరణగావించారు. అలాగే శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి గాజుల అలంకరణ గావించారు.

**ఆలయాల్లో శ్రావణ శోభ**

**చెరుకుపల్లి:** మండలంలోని పలు ఆలయాల్లో మహిళలు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుళ్లపల్లి గంగాంబికా సమేత ఆనందీశ్వర స్వామి ఆలయంలో చెరుకుపల్లి పోలేరమ్మ, ఆరేపల్లి నూకాలమ్మ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణగావించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

**వైభవంగా కుంకుమార్చనలు**

**రేపల్లె:** పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రైలుపేటలోని పట్టాభిరామస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వ్రత పూజలు, కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మల్లెపూల చీరతో ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తటవర్తి రాధిక, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



అభయ ప్రధాయినిగా బండ్లమ్మవారి దర్శనం



ప్రత్యేక అలంకరణలో స్వరాజ్యలక్ష్మి అమ్మవారు



మహాలక్ష్మీదేవిగా పూజలందుకుంటున్న పేటేరు గ్రామదేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారు



ఆనందీశ్వరమ్మ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రేపల్లెలో ప్రత్యేక పూజలందుకుంటున్న గ్రామదేవత బూరుగులమ్మ వారు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మతల్లి



గాజుల అంకరణలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి

### సమన్వయంతో పనిచేయాలి

ఎంపీ విజయసాయిరెడ్డి

**వలివేరు(కొల్లూరు):** ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అన్నారు. చుండూరు మండలం వలివేరులోని ఓ కల్యాణ మండపంలో ప్రగతి మార్గం– ప్రజా ప్రయాణం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అధ్యక్షత వహించారు. రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడారు. కార్యక్రమంలో బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ యూత్ జిల్లా అధ్యక్షుడు మేరుగ కిరణ్ నాగ్, ఎంపీపీ జాలాది రూబేన్, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్యమోహన్‌రెడ్డి, చుండూరు, వలివేరు సర్పంచులు ఉయ్యూరు అప్పిరెడ్డి, వందిపాటి ఏసు, ఎంపీటీసీ సభ్యుడు అమర్తలూరి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అన్నపరెడ్డి రఘురామిరెడ్డి, చుండూరు, వేమూరు జేసీఎస్ మండల కన్వీనర్లు అన్నపరెడ్డి వీరారెడ్డి, దాది సుబ్బారావు, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు అయిల సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గాదె శివరామకృష్ణారెడ్డి, వేమూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, నాయకులు చీదేపూడి సాంబిరెడ్డి, కోగంటి లవకుమార్, రెడ్డయ్య పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివారెడ్డి

**కొల్లిపర:** వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొల్లిపరకు చెందిన జొన్నల శివారెడ్డి నియమితులయ్యారు. మిత్ర బృందంతో శుక్రవారం ఆయన ఎమ్మెల్యే శివకుమార్‌ను తెనాలిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి కృషి చేసినందుకు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ నాయకులు కలసికట్టుగా మెలగుతూ, పేదలకు అండగా ఉంటూ సీఎం జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.

## ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



పెదమట్లపూడిలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- పెదమట్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

**నగరం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి ముంగిటకే చేరుతున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పెదమట్లపూడిలోని మహ్మదీయపాలెం, రెడ్లపాలెం గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంటలకు సాగునీటిని అందించాలని రైతులు ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి, సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అంతర్గత రోడ్లు వేయాలని, గృహ నిర్మాణాలు చేపట్టాలని మోపిదేవికి స్థానికులు విన్నవించారు. ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కార మార్గాలు చూపాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇంటివద్దకే ఎలాంటి అవినీతికి తావులేకుండా, అధికారులు చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా నేరుగా అందుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెదమట్లపూడి, మహ్మదీయపాలెం, రెడ్లపాలెం గ్రామాల్లో 300 గృహాలను సందర్శించి, సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి హరినాథబాబు, సర్పంచ్ లుక్కా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ జరీనా, అబ్దుల్ కరీం, ఖాదర్‌ఖాన్, బాజీఖాన్, తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణిప్రసాద్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజ్ఞాన కేంద్రంతో ఎన్నో ఉపయోగాలు

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

**పెదనందిపాడు :** విజ్ఞాన కేంద్రం వల్ల అందరికి చాలా ఉపయోగాలు ఉన్నాయని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. శుక్రవారం పెదనందిపాడులో పార్టీ సీనియర్ నాయకుడు తెళ్ళ నారాయణ పేరుమీద నూతనంగా నిర్మించిన విజ్ఞాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో రాఘవులు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడం స్థానికంగా అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కేంద్రం నిర్మాణానికి అన్ని పార్టీల నాయకులు సహకరించారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, సేవా కార్యక్రమాలపై అధ్యయనం చేసి, ప్రణాళికలు రూపొందించనున్నట్లు అయన తెలిపారు. ఉత్పత్తికి అవసరమైన నైపుణ్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, నర్రా బాలకృష్ణ, నిర్మాణ కమిటీ సభ్యులు దొప్పలపూడి రమేష్, కాకుమాను నాగేశ్వరావు, రేనాకన హరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విజ్ఞాన కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న రాఘవులు

## మైనారిటీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

**లక్ష్మీపురం:** మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల్ని సెప్టెంబర్ 1నుంచి ప్రారంభిస్తున్నామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఆయుబ్ హుస్సేన్ తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని చౌత్ర సెంటర్, పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కృష్ణానగర్‌లో గల ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రాల్ని, ఉర్దూ అకాడమీలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేది నుంచి ప్రారంభం కానున్న కంప్యూటర్ శిక్షణ తరగతుల్ని నిరుద్యోగ యువకులు, విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ భాషాభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ అహ్మద్, ఉర్దూ డీఐ షేక్ ఖాసిం, శిక్షణా కేంద్రం పర్యవేక్షకులు షేక్ మహిమున్నీసా, పాల్గొన్నారు.



కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఆయుబ్ హుస్సేన్

### బంగారు గొలుసు లాక్కొని ఆగంతుకుల పరారీ

**గుంటూరు ఈస్ట్:** వ్యక్తి మెడలోని బంగారు గొలుసు ఆగంతుకులు లాక్కొని పరారైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్‌కు చెందిన పి.వెంకట శ్రీనివాసరావు శుక్రవారం తెల్లవారుజామున నడుచుకుంటూ బృందావన్ గార్డెన్స్ 7వ లైనులోకి వెళుతున్నారు. ఈ సమయంలో ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి శ్రీనివాసరావు మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**అసభ్యకర మెసేజ్ పంపుతున్న వ్యక్తిపై ...**

మహిళ సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకర మెసేజీలు పంపుతున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లికార్జునపేటకు చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తి తన సెల్ నంబరు నుంచి అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడు. దీంతో ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, ఇద్దరు ఏఈలు విధుల్లో చేరడంతో వారికి వార్డులు కేటాయించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఏఈలు, డీఈఈలకు వార్డుల వారీగా వర్క్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### నేడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి రాక

**తెనాలి:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం తెనాలి రానున్నారు. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రమ్‌లో ఎం.వి.ఎస్. కపర్ది శత జయంతి స్మారకోపన్యాస సభ సాయంత్రం ఆరు గంటలకు జరగనుంది. 'నెమరు' పుస్తకాన్నీ ఇదే సభలో ఆవిష్కరిస్తారు. సజ్జల రామకృష్ణారెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెనాలి ఆధ్వర్యంలో భారీగా స్వాగతం పలకనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు తెనాలి రూరల్ మండలం నందివెలుగు నుంచి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తారు.

## సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ విజయానికి పునాది

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

**నగరం:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే 2024లో మరలా వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని చేకూర్చుతాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పెదమట్లపూడిలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు, లోకేష్ ఎన్ని యాత్రలు చేసినా, పొర్లు దండాలు పెట్టినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా చంద్రబాబు, పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్నారని ఎంపీ దుయ్యబట్టారు. కులాల వారీగా ఎవరికి ఎన్ని పథకాలు అందించామనే అంశంపై చర్చకు సిద్ధమన్నారు. పేదవాడిని ఆదుకోవాలనే తపన ఉన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. పేదల పక్షపాతిగా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగన్ 2024లోనూ మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. చంద్రబాబు హయాంలో 36 లక్షల మందికి పింఛన్లు ఇస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో 63 లక్షల మందికి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు తమకు రాలేదని ఒక్కరి చేతనైనా చెప్పించగలరా..? అని ప్రతిపక్షాలకు ఎంపీ మోపిదేవి సవాల్ విసిరారు. సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని వారికి.. మరలా అందిస్తున్నట్లు తెలిపారు.

**గ్లోబల్ ప్రచారానికి తెరలేపుతున్న టీడీపీ నాయకులు..**

టీడీపీ సానుభూతి పరుల ఓట్లు తొలగిస్తున్నారనే గ్లోబల్ ప్రచారానికి తెరలేపుతున్నారని ఎంపీ మోపిదేవి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో సుమారు 40 వేలకు పైగా దొంగ ఓట్లు చేర్పించి, చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో గెలుస్తున్నారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు, లోకేష్ తాము ఓడిపోతామనే అభద్రతా భావంలో ఉన్నారని పేర్కొన్నారు. ఇతర పార్టీల సానుభూతి పరుల ఓట్లు తొలగించాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదని ఎంపీ స్పష్టం చేశారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ దుకాణం ప్రారంభం

**చెరుకుపల్లి:** ప్రకృతి వ్యవసాయంతో ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు లాభాలు కూడా పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జ్యోతి రైతులకు సూచించారు. మండల పరిధిలోని నడింపల్లి యూనిట్, రాజవోలు గ్రామంలో శుక్రవారం వీఓ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మినీ ఎన్‌పీఎం(నాన్ పెస్టిసైడల్ మేనేజ్‌మెంట్) షాపును స్థానిక వీఆర్వోలు శాంతి కుమార్, నెహ్రూ ప్రాంభించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పంటసాగులో ఎక్కువ మోతాదులో పురుగు మందు వాడటం వల్ల రైతులకు ఆర్థిక భారం, ప్రజలకు అనారోగ్య సమస్యలు తప్పడం లేదని తెలిపారు. అంతే కాకుండా భూమి సారం కోల్పోతుందన్నాని పేర్కొన్నారు. తక్కువ ఖర్చులో నాణ్యమైన పంటలు పండించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో తోడ్పడుతుందన్నారు. ఎన్‌పీఎం దుకాణంలో దశపర్ని, జీవామృతం వంటివి అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డి.లక్ష్మి, వీఓఏ నాగమణి, బ్రహ్మయ్య, గుడారయ్య, రైతులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ దుకాణాన్ని ప్రారంభిస్తున్న వీఆర్వో నెహ్రూ

## ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే పూర్తి

**చెరుకుపల్లి:** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ సర్వే మండలంలో ఈ నెల 21తో పూర్తయ్యిందని రేపల్లె ఆర్డీవో జె.పార్థసారధి తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండలంలోని బీఎల్‌ఓలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. నెల రోజుల పాటు 60 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఇంటింటి సర్వే పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గతంలో తొలగించిన ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా డబుల్ ఎంట్రీలు, మార్పులు చేర్పులు, గ్రామాల నుంచి పూర్తిగా వలసపోయిన ఓటర్లను గుర్తించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె.వెంకటేశ్వర్లు, ఆర్ఐ మౌనిక, వీఆర్వోలు పాల్గొన్నారు.



ఓటర్ల సర్వేపై సమీక్షిస్తున్న ఆర్డీఓ పార్థసారథి

## ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

**తెనాలి రూరల్:** ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పారు. అంగలకుదురు ప్రధాన సెంటరులో రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహించే వారి వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం గ్రామంలో పర్యటించారు. దుకాణదారులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని, పాదచారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన సూచించారు. అనంతరం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణ మార్కెట్ సెంటర్‌లో తోపుడ బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారితో పీసీఆర్ సీఐ కె. శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్ఐ బి. శివరామయ్య మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని సూచించారు.

